నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, ఆదివారం 14 జనవరి 2024 | KAMAREDDY



## నేడు భోగి..

పుష్యశుద్ధ తదియ ఆదివారం భోగి పర్వదినాన్ని ప్రజలు జరుపుకొంటున్నారు. భోగికి పిడకలు పెట్టి మధ్యలో రంధ్రం చేసి హారంగా తయారుచేస్తారు. ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, పాత సామన్లు భోగి మంటల్లో వేస్తారు. సూర్యోదయం అనంతరం చిన్నపిల్లలకు కొత్త బట్టలు ధరింపజేసి రేగుపండ్లు, రాగి నాణేలు, చెరుకు ముక్కలు, నువ్వులు కలిపి తలపై నుంచి జారేలా భోగి పండ్లు పోస్తారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు ఇస్తారు. ఇలా చేయడంతో పిల్లల్లో ఆయుష్షు పెరుగుతుందని, పెద్దల దీవెనలతో చదువులో బాగా రాణిస్తారని ప్రతీతి.



# సంక్రాంతి సందడి

- ఊరూరా పండుగ వాతావారణం
- నేడు భోగి, రేపు సంక్రాంతి, 16న కనుమ
- గాలిపటాల రెపరెపలు
- మూడు రోజుల వేడుకలు
- పిండివంటలకు సిద్ధం

**సూర్యుడు మకరరాశిలోకి** ప్రవేశించిన రోజు మకర సంక్రాంతిగా పాటిస్తారు. ధనుర్మాసం పూర్తయి సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరం వైపు తిరిగే ఉత్తరాయణ పుణ్యకాలమే సంక్రాంతి. మార్గశిర, పుష్యమాసాల సందికాలంలో హేమంత రుతువులో వచ్చే ఈ పండుగను మూడురోజులపాటు ఉత్సాహంగా జరుపుకొంటారు. మకర సంక్రాం తి తెలుగు రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే పర్వదినం. ఈ పండుగ భోగి, మకర సంక్రాంతి, కనుమ అని మూడు రోజుల పాటు జరుపుకొంటారు. 14న భోగి, 15న మకర సంక్రాంతి,16న కనుమ పండుగ ఘనంగా జరుపుకోనున్నారు.

–కామారెడ్డి/సుభాష్‌నగర్, జనవరి 13





## వంటకాల్లో మహిళలు నిమగ్నం

పిండి వంటకాలకు ప్రత్యేకమైన పండుగ సంక్రాంతి. సంక్రాంతి వంటకాల్లో గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా మహిళలు నిమగ్నమయ్యారు. సలసలకాగే నూనె, మూకుడు, వంటల నుంచి వచ్చే పొగ.. గంటల తరబడి కూర్చొని పిండి వంటలే వేయడం. తర్వాత పాత్రలను శుభ్రం చేయడం వంటి కష్టాన్ని మహిళలు ఇష్టంతో చేస్తారు. ఏ ఇంటివైపు చూసినా.. కమ్మని వాసనతో కళకళలాడుతాయి. ఇండ్లన్నీ ఘుమఘుమలాడుతాయి. ప్రతి ఇంటా పిండి వంటలు సిద్ధమవుతున్నాయి. సకీనాలు, గారెలు, బూరెలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు.





## రెడీమేడ్ పిండి వంటకాలు...

సంక్రాంతి సందర్భంగా పిండి వంటలు చేసుకోని వారి కోసం పలు ప్రాంతాల్లో రెడీమేడ్ వంటకాలు చేసున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్, ఎన్‌జీవోస్ కాలనీ, డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామాల్లో పలువురు మహిళలు పిండివంటలు చేసి విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఇంట్లో తయారు చేసుకోలేని వారు వీరి వద్ద కొనుగోలు చేసి రుచి చూస్తున్నారు.








## మార్కెట్లో సంక్రాంతి సందడి

పండుగకు కావాల్సిన ముగ్గులు, నోములు, పండ్లు, వస్త్రాల కొనుగోళ్లు మార్కెట్లో జోరుగా సాగుతున్నాయి. ఏ షాపు చూసినా జనంతో నిండుగా కనిపిస్తున్నది. నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, బాన్సువాడ తదితర పట్టణాల్లోని మార్కెట్లలో నోములు, పిల్లలకు భోగి పండ్లతో పాటు చిలకలు, బత్తీసిల దండలు, రంగవల్లులను అందంగా తీర్చిదిద్దడానికి పలు రకాల ముగ్గులను కొనుగోలు చేస్తున్నారు.



# సంక్రాంతికి స్వగ్రామానికి..

## రైతునగర్‌కు చేరుకున్న వలస కుటుంబాలు



ఒక్కచోట చేరిన రైతునగర్ గ్రామస్థులు (ఫైల్)

- ఉమ్మడి కుటుంబంలా సంక్రాంతి వేడుకలు
- మూడు రోజుల పాటు వైభవంగా సంబురాలు
- రైతునగర్ గ్రామంపై ప్రత్యేక కథనం..

బాన్సువాడ, జనవరి 13: సంక్రాంతి వస్తుందనగానే ఆ ఊరివారంతా ఒక్కచోటికి చేరుతారు. ఇతర దేశాలు, రాష్ట్రాలు, పట్టణాల్లో ఉన్నవారంతా సొంతూరికి వస్తారు. ఊరంతా కలిసి ఉమ్మడిగా వేడుకలు నిర్వహిస్తారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని రైతునగర్ గ్రామం పండుగకు పూర్వవైభవం తెస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది. గ్రామంలో ఏర్పాటు చేసుకున్న జన్మభూమి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వేడుకలు అంబరాన్నంటుతాయి. సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలతో ఊరంతా సందడి నెలకొంటుంది. ఉద్యోగులు, వ్యాపారులు, చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో తీరికలేని జీవితం గడుపుతారు ఇక్కడివారు కొందరు. మూడు రోజుల పాటు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లను పక్కనపెట్టి పల్లెవాతావరణంలో పిల్లలతో కలిసి సంక్రాంతి సంబురాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొంటారు.

**ఉమ్మడి జిల్లాలో రైతునగర్ ప్రత్యేకం..**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే సంక్రాంతి పండుగకు చిరునామాగా రైతునగర్ గ్రామాన్ని చెప్పవచ్చు. ఎక్కడా లేనివిధంగా గ్రామమంతా చిన్నాపెద్ద, తారతమ్యం లేకుండా కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొంటారు. సంక్రాంతి పండుగ సంబురాల్లో భాగంగా గ్రామమంతా ఒకే కుటుంబంలా వేడుకలు నిర్వహించేలా గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు, పెద్దలు కూడి జన్మభూమి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో సంబురాలను నిర్వహిస్తారు. ఎంతో దూరంలో స్థిరపడిన వారంతా సంక్రాంతి వచ్చిందంటే పుట్టిన ఊరికి వచ్చి సంబురాల్లో పాల్గొంటారు. నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తారు. గ్రామంలోని మూలమలుపుల వద్ద బంధువులతో కలిసి భోగి మంటలు వేస్తారు. అక్కడి నుంచి గ్రామంలో వయసు భేదం లేకుండా హరిదాసుడి ఆటలు, కుర్చీల ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు,కబడ్డీ, తాడు గుంజుడు,చిన్నారులకు కైట్ ఫెస్టివల్, మహిళలకు ముగ్గుల పోటీలు, వాలీబాల్‌తో పాటు నృత్యప్రదర్శనలను నిర్వహిస్తారు. సోమవారం గ్రామంలో ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం రోజు జన్మభూమి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక భోజనాలు ఏర్పాటు చేసుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటారు. సాయంత్రం వేళ ప్రతి ఏటా మాదిరిగానే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి దంపతులను ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం, భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకొంటారు.

**ముచ్చటగా మూడురోజుల పండుగ**

సంక్రాంతి పండుగను రైతునగర్ గ్రామస్తులు మూడు రోజులపాటు నిర్వహిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు పచ్చని తోరణాలు, ముంగిట ముగ్గులు, రోడ్ల వెంట లైటింగ్, చిన్నారుల నృత్యాలు, పెద్దలకు క్రీడాపోటీలు, వృద్ధుల రచ్చబండ ముచ్చట్లు ఇలా గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంటుంది.

**ప్రగతికి చిరునామాగా..**

రైతునగర్ గ్రామం 75 ఏండ్ల క్రితం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఏలూరు, ఒంగోలు తదితర గ్రామాల నుంచి వచ్చిన ఐదు కుటుంబాలతో ఏర్పాటైనట్లు చెబుతారు. వ్యవసాయం నిమిత్తం అమరనేని శివయ్య అనే వ్యక్తి మొదటగా వచ్చి గుడిసెలు వేసుకొని జీవించారని గ్రామస్తులు చెబుతారు. అనంతరం వ్యవసాయంలో ఆదర్శంగా నిలువడంతో గ్రామానికి రైతునగర్‌గా పేరు వచ్చిందని, అప్పట్లో రంగనాయకులు గ్రామ ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు చెబుతుంటారు. గ్రామంలో కరెంటు, రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం రైతునగర్ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి సహకారం, సర్పంచ్ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో రైతునగర్ అభివృద్ధిలో దూసుకు పోతున్నది.

### సంక్రాంతికి వచ్చాం..



ఏటా సంక్రాంతికి సొంతూరికి వస్తాం. వైభవంగా గ్రామస్తులందరం కలిసి పండుగను నిర్వహించుకుంటాం. పనులన్నీ పక్కనపెట్టేసి కలిసి ఒక్కచోట చేరి మాట్లాడుకుంటాం. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటాం. ఊరువాడా అంతా పచ్చని తోరణాలు., రంగుల లైట్ల కాంతులు ఎక్కడ చూసినా పండుగే. మర్చిపోలేని అనుభూతి కలుగుతుంది.

**- పాలేటి రామ్‌చరణ్, యశిని, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు(ఆస్ట్రేలియా)**

### సంతోషంగా ఉన్నది..



ఎంత పెద్ద పదవిలో, బిజీగా ఉన్నా సంక్రాంతికి సొంతూరికి రావడం చాలా సంతోషంగా ఉంటుంది. స్నేహితులతో మాటామంతి, ఊరంతా కలిసి కుటుంబీకులుగా వేడుకలను ఘనంగా జరుపుకుంటాం. ఖండాంతరాలు దాటి వచ్చి వేడుకల్లో పాల్గొనడం విశేషం.

**- సత్యనారాయణ, అదనపు డీసీపీ, హైదరాబాద్**

# మేకల సంత @ రూ.3.50 కోట్లు

## నవీపేటలో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు

నవీపేట, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంతలో రికార్డు స్థాయిలో క్రయవిక్రయాలు జరిగాయి. ఒక్కరోజే రూ.3.50 కోట్లకుపై జీవాల క్రయవిక్రయాలు జరిగినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. సంతకు మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వ్యాపారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో సంత మొత్తం అమ్మకం, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. ఒక్కో మేకకు రూ. 12వేలకుపైగా ధర పలకడం గమనార్హం.



# నిజామాబాద్ నుంచి కవిత పోటీ చేయాలి

## నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 13 : నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎమ్మెల్సీ కవిత పోటీ చేయాలని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని పేర్కొన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఈ ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ప్రజలకు అందే వరకు బీఆర్‌ఎస్ తరపున ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత పోటీ చేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులుగా, ఉద్యమకారులుగా కోరుకుంటున్నామని చెప్పారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత కవితకే దక్కిందన్నారు. ఆమె హయాంలో నిజామాబాద్‌కు మెడికల్ కళాశాల, రెండు కేంద్రియ విద్యాలయాలు, నందిపేట్ సెజ్, రైల్వేలైన్లు వచ్చినట్లు తెలిపారు. ప్రజల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం పార్లమెంట్‌లో గళం విప్పి విశ్వప్రయత్నాలు చేసిన ఘనత కవితకే దక్కుతుందన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు 284 ప్రశ్నలు వేసి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన ఘనత కవితకే దక్కుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న ఉద్యమ నాయకురాలు కవిత మళ్లీ ఎంపీగా పోటీ చేయాల్సిందిగా జిల్లా ప్రజల పక్షాన కోరుతున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, కరిపె రాజు, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

# కళలతో సంస్కృతీ సంప్రదాయాల సంరక్షణ

భిక్కనూరు, జనవరి 13: భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించే భరతనాట్య ప్రదర్శనను జిల్లా ప్రజలు తిలకించి విజయవంతం చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు. ఆలయం వద్ద ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కళా ప్రదర్శన దోహదపడుతుందన్నారు. కావూరి కుటుంబం సహకారంతో కోనేరు ప్రాంగణంలో పునరుద్ధరణ పనులు చేపట్టారని తెలిపారు. కలెక్టర్ వెంట కల్పనారమేశ్, భిక్కనూరు ఎంపీడీవో అనంతరావు, ఈవో శ్రీధర్, అర్చకుడు రామగిరిశర్మ ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## ప్రముఖుల శుభాకాంక్షలు

కామారెడ్డి రూరల్/కంఠేశ్వర్, జనవరి 13: ప్రజలు సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలంటూ ఉమ్మడి జిల్లా ప్రముఖులు శనివారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి రోజున ప్రజలు చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ కోరారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళ తెలుగు లోగిళ్లు అలనాటి అనుభూతులకు వేదికలుగా మారుతాయని పేర్కొన్నారు. పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో విద్యుత్ వైర్లు, ఇండ్లపై అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**సిరులకాంతులు విలసిల్లాలి..**

జిల్లా ప్రజలకు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. భోగభాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది అన్ని శుభాలూ చేకూరాలని, అనుకున్న పనులన్నీ నెరవేరాలని, ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలాషించారు.



## వరద కాలువకు నీటి విడుదల

ముప్కాల్, జనవరి 13: ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేపలు పట్టేవారు, పశువుల కాపరులు, రైతులు, ప్రజలు వరదకాలువ పరిధిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

# గుప్తనిధుల కోసం తవ్వకాలు

## నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### బోధన్ మండలంలో ఘటన

బోధన్ రూరల్, జనవరి 13: ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయంటూ తవ్వకాలకు పాల్పడిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ ఘటన బోధన్ మండలం బర్దిపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం..బర్దిపూర్ గ్రామానికి చెందిన మహేందర్ తన ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని భావించి తవ్వకాల కోసం హైదరాబాద్‌కు చెందిన సీతారామచారి మహారాజ్‌ను ఆశ్రయించాడు. సదరు మహరాజ్‌తో శనివారం రాత్రి పూజలు చేయించి గుప్త నిధుల తవ్వకాలు ప్రారంభించారు. తవ్వకాల శబ్దం రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్, ఏఎస్సై రవీందర్ చేరుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న నలుగురిని (మహేందర్, సీతారామచారి, వీరయ్య, సాయిలు) అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారణ చేపట్టిన అనంతరం బోధన్ తహసీల్దార్ ఎదుట వారిని బైండోవర్ చేశారు.